# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- 'వికసిత్ భారత్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్' (VB-G-RAM-G) బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు.
- యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు.
- పోలియో రహిత సమాజన్ని నిర్మించడమే ప్రభుత్వం లక్ష్యమని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.
- శ్రీలంకతో ఐదు టీ-20ల సిరీస్‌లో భాగంగా భారత మహిళల క్రికెట్ జట్టు విశాఖపట్నం వేదికగా తొలి మ్యాచ్ ఈరోజు ఆడనుంది.
- రానున్న 5 రోజుల్లో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత తక్కువగా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

రెండు దశాబ్దాలుగా అమల్లో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNREGA)-2005 స్థానంలో సరికొత్తగా తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్' (VB-G RAM G) బిల్లు-2025కు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. దీంతో ఈ నూతన చట్టం తక్షణమే అమల్లోకి రానుంది. ఈ చట్టం ద్వారా గ్రామీణ ప్రజలకు లభించే చట్టబద్ధమైన పని దినాలను ప్రభుత్వం భారీగా పెంచింది. ఇప్పటివరకు సంవత్సరానికి 100 రోజులుగా ఉన్న పని దినాలను.. ఇకపై ప్రతి ఆర్థిక సంవత్సరానికి 125 రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 'వికసిత్ భారత్ @2047' లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణ భారతాన్ని స్వయం సమృద్ధిగా, సుసంపన్నంగా తీర్చిదిద్దేందుకు ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది.

====================

రాష్ట్రంలో 54 లక్షల మందికి పైగా చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా చర్యలు చేపట్టామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కాకినాడలో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు మంత్రి పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పోలియో రహితంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని జిల్లాల్లో 98 లక్షల 99 వేల 300 డోస్ లు అందుబాటులో ఉంచామన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, మేళాలు, బజార్‌లు, పర్యాటక ప్రదేశాలలో 1,140 మొబైల్ బూత్‌లను ఏర్పాటు చేశామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

====================

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఒడిశా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు సూచించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 44వ రాష్ట్ర మహా సభల ముగింపు కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిబాబు యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశ జనాభాలో 65 శాతం యువత ఉన్నారని, వారి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. నూతన విద్యా విధానంలో విద్యార్థులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

====================

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మంత్రులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు రెండు చుక్కల పోలియో మందు రక్షణ కవచంగా పని చేస్తుందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెం గ్రామంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో రాష్ట్ర రహదారులు, భవనాలు శాఖ మంత్రి బీ సీ జనార్దన్ రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయనగరం జిల్లా గొట్లాం గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

====================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రాగల 5 రోజుల్లో ఆంధ్రప్రదేశ్, యానాంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 - 4 డిగ్రీల సెంటీగ్రేడ్ తక్కువగా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

=====================

వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు.. ఆ టోర్నీ తర్వాత తొలి పోరుకు సిద్ధమైంది. శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో భాగంగా విశాఖపట్టణం వేదికగా తొలి మ్యాచ్ ఆడనుంది. విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా మొదటి టీ-20 క్రికెట్ మ్యాచ్ ఈ రోజు రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. బ్యాటింగ్‌లో హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, దీప్తిశర్మ మంచి ఫామ్‌లో ఉన్నారు.

=====================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమన్ని రేపు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

Meekosam.ap.gov.in వెబ్ సైట్ లో కూడా అర్జీలను నమోదు చేయవచ్చని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల సమస్యలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) లో నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించిన సమాచారం కొరకు 1100 ఫోన్ నంబర్ ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

=====================
=====================